క్లుప్తంగా

30న దమ్మ యాత్ర

తిరుపతి కల్చరల్: అశోక చక్రవర్తి యుద్ధానంతరం బౌద్ధ వ్యాప్తికి చేసిన కృషి, బౌద్ధ విశిష్టతను తెలియజేస్తూ ఈ నెల 30న చేపట్టిన అశోక–అంబేడ్కర్ దమ్మ యాత్రను జయప్రదం చేయాలని అంబేడ్కర్ భవన్ నేత పరమశివన్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన దమ్మ యాత్ర ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు.

టాస్క్‌ఫోర్స్ డీఎస్పీకి వీడ్కోలు



మురళీధర్‌ను సత్కరిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, సిబ్బంది

తిరుపతి మంగళం : తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా ఇటీవల రెండవ సారి బాధ్యతలు చేపట్టిన డి.మురళీధర్ అనంతపురంలోని ఏపీ పోలీస్ అకాడమీ ఏఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో పదోన్నతిపై వెళ్తున్న మురళీధర్‌కు శనివారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్ దుశ్శాలువ కప్పి మెమెంటోతో సత్కరించి వీడ్కోలు పలికారు. గతంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా విశేష సేవలందించిన మురళీధర్, తిరిగి టాస్క్‌ఫోర్స్‌కు కొద్ది రోజుల్లోనే ఏఎస్పీగా పదోన్నతి పొందడంపై అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

రక్తదానం

తిరుపతి తుడా: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో 20 మంది దాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందించే రీతిలో యువత ఉండాలని దాతలు కోరారు. రోగులకు రక్తం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడినట్లు ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు.

అమిగోస్ బిల్డర్స్‌లో కస్టమర్ మేళా



అనిల్‌రెడ్డి

తిరుపతి సిటీ: సాధారణ, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చే ఉద్దేశంతో అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ యాజమాన్యం అతితక్కువ ధరలకు అపార్ట్‌మెంట్ కస్టమర్ మేళాను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సంస్థ అధినేత అనిల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ సచివాలయం ఎదురుగా నాణ్యతా ప్రమాణాలతో రెడ్ ఓక్స్ అపార్ట్‌మెంట్ నిర్మించామన్నారు. ముందుగా తమను సంప్రదించిన వారికి భారీ తగ్గింపు ఉంటుందని తెలిపారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న రాంబాబు

తిరుపతి సిటీ: చిరుధాన్యాలతోనే మానవునికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మిల్లెట్స్ రాంబాబు పేర్కొన్నారు. మహిళావర్సిటీ వేదికగా శనివారం చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఆహారపు అలవాట్లపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోజూ మానవుడు తీసుకునే ఆహారంలో 36 శాతం పీచు పదార్థాలు ఉండాలన్నారు. అనంతరం కొర్రలు, సజ్జలు, జొన్నలు, సాములు, అరికలు వంటి చిరుధాన్యాలతో వంటకాలు ఎలా చేయాలో డెమోతో విద్యార్థులకు, అధ్యాపకులకు వివరించారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్ డాక్టర్ బిందు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(అలిపిరి): మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. శనివారం తిరుపతిలోని హౌసింగ్ ఈఈ కార్యాలయ ఆవరణలో 'మన ఇళ్లు–మన గౌరవం' పేరుతో లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంజూరైన 20,104 ఇళ్ల నిర్మాణాల్లో 1,601 నిర్మాణాలు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారని.. మిగిలిన వారంతా వెంటనే పూర్తి చేయాలని కోరారు. మిగిలిన 18,509 ఇళ్లను మార్చి 2025 లోపు పూర్తి చేయాలని సూచించారు. త్వరలో లేఅవుట్‌లను సందర్శిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు బీఎన్ఐ వ్యాపారవేత్తల సమ్మేళనం

తిరుపతి కల్చరల్: పట్టణంలోని మంగళం రోడ్డులో ఉన్న ఆశా కన్వెన్షన్ హాల్లో బీఎన్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం వరకు వ్యాపార వేత్తల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఎన్ఐ కన్సల్టేటివ్ చైర్మన్ కె.పార్థ, సాయి కిరణ్, ఈడీ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్తలు సుమారు 650 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

బాబు పాపాలను ప్రక్షాళన చేయండి

- తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో పూజలు
- భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై కక్ష సాధింపు ఆపాలని డిమాండ్
- సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించు స్వామీ అంటూ పూజలు



తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రార్థిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్, సమన్వయకర్త



అమ్మవారికి హారతి ఇస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి సిటీ: సీఎం చంద్రబాబు కలియుగదైవంపైనే కుట్ర పన్నడం దారుణమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరిషా, వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్ అన్నారు. శనివారం తిరుపతి గంగమ్మ గుడిలో పూజలు చేశారు. అలాగే ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వర్సిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపకుడు కొండ యుగంధర్, ఏపీ వీహెచ్‌ఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రూకేష్, విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బ తీస్తారా..!

తిరుపతి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పెరుమాళ్లపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రాశస్త్యాన్ని నాశనం చేసేలా ఆరోపణలు చేస్తూ భగవంతుడి పేరు చెప్పి చేస్తున్న పాపాలను ప్రక్షాళన చేయాలని కొబ్బరికాయలు కొట్టి వేడుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల నేతలు కె.మునీశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, దామోదర్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో కుట్రలు చేస్తూ కూటమి ప్రభుత్వం తిరుమల ప్రాశస్త్యాన్ని నాశనం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక చంద్రగిరి జమండ్లవీధిలోని వరసిద్ధి వినాయక ఆలయంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. వారు మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి అత్యంత భక్తిశ్రద్ధల తో సమర్పించే లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందంటూ చంద్రబాబు అసత్య ప్రచారం చేశారన్నారు. అలాకాకుండా కేవలం వైఎస్ జగన్‌ను టార్గెట్ చేస్తూ ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఎంపీటీసీ దెయ్యాల మాధవరెడ్డి, స్థానిక నాయకులు రాజమునీంద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



జమండ్లవీధి వరసిద్ధి వినాయక ఆలయంలో..

వేలంపాటలో ఈఓ అత్యుత్సాహం

- చెప్పకుండానే ముగించిన వేలంపాట
- నిలదీసిన గుత్తేదారులు, వాయిదా పడిన జంతువధ శాల



పంచాయతీ ఈఓ మహేశ్వరయ్యను నిలదీస్తున్న వేలం పాటదారులు

చంద్రగిరి: గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే వనరుల వేలం పాటలో పంచాయతీ ఈఓ అత్యుత్సాహం ప్రదర్శించడంతో వేలం దక్కించుకునేందుకు వచ్చిన గుత్తేదారులు మండిపడ్డారు. ఈ ఘటన శనివారం పంచాయతీ కార్యాలయంలో చోటు చేసుకుంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు స్థానిక వనరులపై వచ్చే వసూళ్లను సర్పంచ్ ముదికుప్పం రూపరామ్మూర్తి అధ్యక్షతన ఉదయం వేలం పాట ప్రారంభించారు. ఇందులో వారపు సంతను ఆరు నెలలకు రూ.షణ్ముగం రెడ్డి రూ.14.61 లక్షలు, ప్రైవేటు బస్టాండ్(ఆర్టీసీ మినహా)ను వెంకటరెడ్డి రూ.4.2 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

ఆగిన జంతువధ శాల వేలం..

జంతువధశాలకు వేలం జరిగే సమయంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం ప్రదర్శించారు. వేలం పాట సమయంలో చివరి పలుకు పలికేటప్పుడు వేలం పాటదారులను అడిగి పాటను ముగించడం ఆనవాయితీ. అయితే అలా కాకుండా పాటను ముగించడంతో అక్కడే ఉన్న ఆశావహులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు చెప్పకుండా ఎలా ముగిస్తారంటూ ఈఓను నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా వేలం నిర్వహించడంతో కాసేపు అక్కడ రసాభాసాగా మారింది. ఈఓపై మండిపడ్డారు. తిరిగి జంతువధశాల వేలం నిర్వహించాలంటూ సభ్యులు పట్టుపట్టడంతో తాత్కాలికంగావాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

తిరుచ్చిపై శ్రీనివాసుడి చిద్విలాసం



తిరుచ్చిపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శనివారం పెద్దఎత్తున భక్తులు పోటెత్తారు. పెరటాసి మాసం రెండవ శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను చేపట్టారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి శోభాయమానంగా అలంకరించారు. తరువాత ఆలయంలోని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మహిళలు ఆలయంలో నేతిదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

బంగారు తిరుచ్చిపై శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెరటాసి మాసం నాలుగో శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయ ఏఈఓ గోపినాథ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- అక్టోబర్ 3 నుంచి తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లపై చెవిరెడ్డి సమీక్ష



ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఆలయం వద్ద ముమ్మర ఏర్పాట్లు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆలయం వద్ద ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. తిరుమల తరహాలో భక్తులను ఆకట్టుకునేలా, స్వామివారి వాహనం విహరించే అన్ని ప్రాంతాల్లో బ్రహ్మోత్సవ కళ ఉట్టిపడేలా విద్యుదీపాలంకరణలు చేయాలన్నారు. ఇప్పటికే మాడవీధుల్లో, ఆలయం ముందు చలువ పందిళ్లు వేస్తున్నారు. రంగవల్లులతో అందంగా ముస్తాబు చేస్తున్నారు.

వాహన సేవల వివరాలు..

అక్టోబర్ 3న సాయంత్రం 4 గంటలకు జరిగే అంకురార్పణతో పాటు సేనాధిపతి ఉత్సవం, 4న ఉదయం 6 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం, 5న ఉదయం 7 గంటలకు చిన్న శేషవాహనం, రాత్రికి హంసవాహనం, 6న ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 7న ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 8న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడవాహనం, 9న ఉదయం హనుమంతవాహనం, రాత్రి గజవాహనం, 10న ఉదయం సూర్యప్రభవాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 11న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం, 12న ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

రైతులకు అండగా ఉంటాం

చంద్రగిరి: సుమారు 20 ఏళ్లగా నరసింగాపురం రైతు సేవా సహకార సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోందని మాజీ సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి అన్నారు. శనివారం నరసింగాపురంలోని సింగిల్‌విండో బ్యాంకు వద్ద మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అధ్యక్షుడిగా వచ్చిన సమయంలో రూ.3.5 కోట్ల అప్పుల్లో ఉన్న బ్యాంకు నేడు సుమారు రూ.15 కోట్లతో లాభదాయకంగా నడుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రంగవీక్షణ పుస్తకం ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆకాశవాణి విశ్రాంత అధికారి ఆకుల మల్లేశ్వరరావు రచించిన రంగ వీక్షణ వ్యాస సంపుటి పుస్తకాన్ని శనివారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య సదాశివమూర్తి వక్తగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, ధర్మయ్య, వేమూరి జయరాం ప్రసాద్, ఏనుగు అంకమనాయుడు, జిల్లేల్ల బాలాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఓసీపల్లె విద్యార్థులు



రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయలు

పాకాల: మండలంలోని ఓసీపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం సి.కుమార్‌రెడ్డి, పీఈటీ నిరంజన్‌కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన చిత్తూరు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సమీరా అండర్–17 బాలికల డిస్కస్‌త్రో విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది దన్నారు. అలాగే ఈ నెల 24వ, 25వ తేదీన చంద్రగిరిలో జరిగిన నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీల్లో అండర్–14 బాలుర డిస్కస్‌త్రో విభాగంలో జ్ఞానసాయి మొదటి స్థానం, బాలికల విభాగంలో శ్రావణి ద్వితీయ స్థానం, రాజశేఖర్ లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. అండర్–17 బాలుర విభాగంలో కోటకొండ విష్ణు జావలిన్‌త్రోలో తృతీయ స్థానం సాధించారు. అలాగే అండర్–17 వాలీబాల్‌లో కోట విష్ణు, కత్తి విష్ణు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్–17 బాలికల విభాగం వాలీబాల్‌లో కల్పన, సమీరా జిల్లా స్థాయికి, అండర్–14 బాలుర విభాగంలో వెంకటేష్, బాలికల విభాగంలో ఉమా వాలీబాల్‌లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కబడ్డీ పోటీల్లో అండర్–14 విభాగంలో జ్ఞానాసాయి, అండర్–17 బాలికల విభాగం కబడ్డీలో స్వర్ణ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో పార్థసారథి ఖోఖో క్రీడలో, యోగాలో సమీర, నితీశా, సంపత్‌కుమార్ వేదిక్, భువనేశ్వరి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అలాగే చందరంగంలో నాగచైతన్య, అర్జున్, హేమసాగర్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. హెచ్‌ఎంతో పాటు పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న ఉష

తిరుపతి కల్చరల్: పోలీసు కానిస్టేబుల్ అయిన తన భర్త ఏలుమలైరెడ్డి నుంచి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని అతని భార్య ఉష వేడుకున్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము డిగ్రీ చదువుకునే రోజుల్లో ఏలుమలైరెడ్డితో పరిచయమైందని, పెద్దలను ఒప్పించి, 2007లో వివాహం చేసుకున్నామని తెలిపారు. తనకు 9, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. అయితే తన భర్త తనను ఇంటి నుంచి తరిమేసి, మరో వివాహం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొన్ని రోజులుగా వేరే మహిళను పెళ్లి చేసుకున్నానని, తనకు అవసరం లేదని, బెదిరిస్తూ వేధింపులకు గురి చేశారని వాపోయారు. ఈవిషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మహిళా పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టడం జరిగిందని తెలిపారు. దీంతో తన భర్త మళ్లీ తనను చంపేస్తానని బెదిరించడంతోపాటు విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నారని వాపోయారు. తన వద్ద ఉన్న బిడ్డలను కొట్టి తనతో తీసుకెళ్లిపోయాడని, న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉష సోదరుడు పురుషోత్తం పాల్గొన్నారు.

పెరటాసి.. భక్తులు కిక్కిరిసి..



పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు

తిరుపతి కల్చరల్: గోవిందా..అనాద రక్షకా.. ఆపద్బాంధవా కాపాడంటూ ఏడుకొండల వెంకన్నను అలిపిరి పాదాల మండపం వద్ద భక్తులు అర్థించారు. కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన మాసం పెరటాసి మాసం. ఈ మాసంలో శనివారం నాడు భక్తులు ఉపవాసంతో స్వామికి పిండిదీపాలు వెలిగించి పూజలు చేస్తారు. అందులో భాగంగా పెరటాసి నెల రెండవ శనివారం ఉదయం భక్తులు అలిపిరి పాదాల మండపం వద్ద పండి తలిగలు వేసి, పిండి దీపారాధన, పూజలు చేసి గోవింద నామస్మరణ చేశారు. భక్తులతో అలిపిరి పాదాల మండపం కిక్కిరిసింది.

మహిళా వర్సిటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకోసం ఆగమన–2024 పేరిట ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ప్రొఫెసర్ ఉమజ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లికార్జున్, రిజిస్ట్రార్ రజిని, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



మున్సిపల్ కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: మన ఇంటితో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయ పరిసరాలు, కార్యాలయం లోపల శుభ్రపరిచే కార్యక్రమాన్ని సిబ్బందితో కలిసి ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1న వినాయక సాగర్‌లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 2న విజేతలకు నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ తులసి కుమార్, డీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆకట్టుకున్న యువజనోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న యువ కళాకారులు

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సెట్విన్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి యువజనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద బృంద నృత్యం, జానపద గీతాలాపన, కవిత్వం, కథలు రాయడం, పెయింటింగ్ వంటి విభాగాలలో జిల్లాలోని సుమారు 125 మంది యువ కళాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్యులు

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం శనివారం రాత్రి పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నాయుడుపేట పట్టణానికి చెందిన గూడూరు కిషోర్‌కుమార్ జిల్లా రూరల్ అధ్యక్షుడిగా, గాదంశెట్టి నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా పత్తిపాటి తులసికృష్ణ, రాష్ట్ర, జిల్లా మహిళా మండలి సభ్యులు, గౌరవ అధ్యక్షుడిగా పారిశ్రామికవేత్త పెసల జయ రాజగోపాల్, జక్కా సుబ్బారావులోపాటు ఇతర మండలాల నూతన కార్యవర్గం చేత ఆ సంఘ రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీమంత్రి టీజీ వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, నెల్లూరు జిల్లా రూరల్ అధ్యక్షుడు కమర్లపూడి సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అన్నదానం

తిరుపతి కల్చరల్: పెరటాసి మాసం రెండవ శనివారం సందర్భంగా టీటీడీ ఏఈఓ కొనేటి సుబ్బరాజు తన మనవడు రుత్విక్ సాయి పేరిట శనివారం కపిలేశ్వర స్వామి ఆలయం వద్ద సుమారు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీకపిలేశ్వర ఆలయ సూపరింటెండెంట్లు కృష్ణవర్మ, జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, వెంకటేష్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.